కర్ణాటకలో... దళం ఖాళీ..!



● మావోయిస్టు రహిత రాష్ట్రం

● రెండున్నర దశాబ్దాల పోరాటానికి తెర

● ఆయుధాలు వీడిన ఆరుగురు మావోయిస్టులు

ఆరుగురు నక్సల్స్ బృందం (ఫైల్)

బెంగళూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పీడిత వర్గాలకు అండగా, దోపిడీ దారులు, భూస్వాముల అరాచకాలపై కదం తొక్కుతూ, ప్రభుత్వాలు తీసుకునే కార్మిక, ప్రజా వ్యతిరేక చట్టాలపై పోరాటమే లక్ష్యంగా సాగిన మావోయిస్టుల ప్రభావం తగ్గిపోతూ వస్తోంది. రెండున్నర దశాబ్దాల క్రితం కర్ణాటక పరిధిలోని పశ్చిమ కనుమలకు అనుబంధమైన శివమొగ్గ, చిక్కమగళూరు అటవీప్రాంతాల్లో కేంద్రాలుగా చేసుకుని ఎన్నో పోరాటాలు సాగించిన మావోయిస్టుల మనుగడ కష్టమవుతోంది. రాష్ట్ర పరిధిలో పదేళ్ల తర్వాత రెండు మూడు నెలలుగా చిక్కమగళూరు జిల్లా పరిధిలో నలుగురైదుగురు మావోయిస్టులు అటవీప్రాంతాలలో సంచరిస్తున్నారనే సమాచారం గుప్పుమంది. అటవీప్రాంతంలోని ఓ ఇంటికి నిత్యావసరాలకోసం వస్తున్నారనే సమాచారంతో మావోయిస్టుల నియంత్రణా దళం (ఏఎన్ఎఫ్) అప్రమత్తమైంది. వ్యూహాత్మకంగా మావోయిస్టులపై దాడికి భారీగా కసరత్తు జరిపింది. ఈ పరిణామం నవంబరులో మావోయిస్టు నేత విక్రమ్‌గౌడ ఎన్‌కౌంటర్‌కు కారణమైంది. విక్రమ్‌గౌడతోపాటు వెంట ఉన్న ఆరుగురు మావోయిస్టులు త్రుటిలో తప్పించుకున్నారు. ఎన్‌కౌంటర్ ప్రభావం ప్రజా సంఘాల ప్రతినిధులను, మాజీ మావోయిస్టులను కలచివేసింది. లొంగిపోవాలని ఓ షరతు విధించి ఉంటే బాగుండేదని మండిపడ్డారు. మావోయిస్టులుగా అటవీప్రాంతాలకే పరిమితమైన వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలనే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇలా రెండుమూడు వారాలుగా సాగిన ప్రక్రియకు తుదిదశ వచ్చింది. వారు ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు చేశారు. రెండురోజుల క్రితమే ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయేందుకు ముహూర్తం కుదిరింది. బుధవారం మధ్యాహ్నం చిక్కమగళూరు జిల్లా అధికారి ముందు లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. అయితే చివరిక్షణంలో మార్పులు జరిగాయి. ఆరుగురు మావోయిస్టులు నేరుగా బెంగళూరులోని సీఎం అధికారిక నివాసం 'కృష్ణ'లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమక్షంలో లొంగిపోయారు.

లొంగిపోయింది వీరే..

సీఎం సమక్షంలో లొంగిపోయినవారిలో ముండగారు లత, కొట్బారు సుందరి, బాళెహొళె వనజాక్షి, కె వసంతతోపాటు మారప్ప ఆరోళి, టిఎన్ జీశ్‌లు ఉన్నారు. వీరికి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం అందజేయనుంది.

25 ఏళ్ల ఉద్యమం

పీపుల్స్‌వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) పేరిట రాష్ట్రంలోని పశ్చిమకనుమలలో దుర్గమ అటవీప్రాంతంలో 25 ఏళ్లక్రితం నక్సల్స్ కార్యకలాపాలు జోరుగా సాగాయి. కారిడార్‌లను రూపొందించుకుని ఉద్యమాలను కొనసాగించారు. అప్పట్లో సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాతోపాటు రాయలసీమప్రాంతంలోని వివిధ జిల్లాల్లోనూ, పశ్చిమ కనుమలకు అనుబంధమైన కేరళలోనూ మావోయిస్టు ఉద్యమాలు కొనసాగాయి. క్లిష్టమైన పరిస్థితి ఎదురైనప్పుడు చిక్కమగళూరు అటవీప్రాంతాన్ని సేఫ్‌జోన్‌గా ఉపయోగించుకున్నారు. రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమానికి శ్రీకారం చుట్టింది చురుకురి రాజకుమార్ నేతృత్వంలోనే. కుదురేముఖ్ జాతీయ ఉద్యానవనాన్ని వ్యతిరేకిస్తూ మావోయిస్టు సాయుధపోరాటానికి సిద్ధమయ్యారు. గిరిజనుల జీవన విధానానికి గనుల తవ్వకాలు తీరని కష్టం కలిగిస్తాయని ఎదురు తిరిగారు. ఇలా ఎదురుతిరిగిన మావోయిస్టులకు సానుభూతి పెరిగింది. రాజకుమార్ అలియాస్ ఆజాద్ దక్షిణ కన్నడ, ఉడుపి, చిక్కమగళూరు, తుమకూరు జిల్లా పావగడ ప్రాంతాలలో వ్యవస్థీకృతంగా మావోయిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేశారు. అప్పటిదాకా శాంతియుతంగా అనిపించిన పశ్చిమకనుమలు, తీరప్రాంత జిల్లాల్లో తుపాకుల మోత ప్రారంభమైంది. 2002 డిసెంబరులో కొప్ప తాలూకా మెణసినహాడ్యలో చీరమ్మ కాలికి బుల్లెట్ తగలడంతో పీపుల్స్‌వార్ గ్రూప్ క్రియాశీలకంగా ఉందని రుజువైంది. 2024 నవంబరు 18న హెబ్రి తాలూకా పీతబైలులో విక్రమ్‌గౌడ ఎన్‌కౌంటర్ వరకు పశ్చిమ కనుమలు ఎన్నో సందర్భాలలో రక్తం చిందింది. రాష్ట్రంలో మావోయిస్టుల కలాపాలు స్తబ్దుగా మారిపోయిన తరుణంలో మావోయిస్టుల నియంత్రణ దళం అవసరం ఉందా..? అనే ప్రశ్న తలెత్తింది. గడిచిన ఏడెనిమిదేళ్లలో మావోయిస్టుల కదలికలు సంపూర్ణంగా క్షీణించాయి. కేరళ, తమిళనాడు వైపు పరారీ అయ్యారు. సాకేత్ రాజన్ ఎన్‌కౌంటర్, గిరిజన నేత శేషయ్య హత్యలను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం 2006లో మావోయిస్టుల నియంత్రణ దళాన్ని ఏర్పాటు చేసింది. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించింది. కొన్నేళ్లుగా మావోయిస్టుల కలాపాలు లేకపోవడంతో ఏఎన్ఎఫ్‌ను రద్దు చేయాలనే చర్చలు సాగాయి. కానీ కొన్ని నెలలుగా చిక్కమగళూరు జిల్లాలో మావోయిస్టుల సంచారం పెరగడం, అందుకు అనుగుణంగా విక్రమ్‌గౌడ ఎన్‌కౌంటర్‌తో ఏఎన్ఎఫ్‌ను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీర్మానించింది.

కలాపాలు ఇలా...

2001 డిసెంబరు 9న కుదురేముఖ్ జాతీయ ఉద్యానవనంలో నక్సల్స్ బృందం వచ్చింది. 2002 ఫిబ్రవరిలో అటవీశాఖ అధికారులు, పీపుల్స్‌వార్ గ్రూప్ నక్సల్స్‌ను గుర్తించారు. ఇదే నెలలో ఆయుధాలతో నక్సల్స్ సంచరిస్తుండగా డీఎఫ్ఓ నారాయణమూర్తి నేతృత్వంలో నక్సల్స్ కార్యకర్త జయణ్ణను అరెస్టు చేశారు. 2002 డిసెంబరులో కొప్ప తాలూకా మెణసినహాడ్య అడవిలో కట్టెలకోసం వెళ్లిన చీరమ్మ కాలికి బుల్లెట్ తగలడంతో పీపుల్స్‌వార్ గ్రూప్ మావోయిస్టులు సంచరిస్తున్నారనేది రుజువైంది. 2003 ఆగస్టు 6న సింగ్సారిలో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయి. 2003 నవంబరు 17న కార్కళ తాలూకా ఈదు గ్రామం బొళ్ళుట్టులో తొలి ఎన్‌కౌంటర్ జరిగింది. కొప్ప తాలూకా సూర్యనారాయణ, పార్వతి, రాయచూరు హాజిమా బలయ్యారు. 2005 ఫిబ్రవరి 6న కర్ణాటక మావోయిస్టుల కీలక నేత మాస్టర్‌మైండ్ సాకేత్‌రాజన్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఇతడితోపాటు శివలింగు కూడా మృతిచెందాడు. సాకేత్‌రాజన్ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో స్మారకాన్ని ఏర్పాటు చేశారు. 2005 జూన్ 23న ఉడుపి జిల్లా దేవరబాళి వద్ద ఎన్‌కౌంటర్‌లో బెళగావికి చెందిన అజిత్ కుసుబి, మూడిగెరెకె చెందిన సబ్లి ఉమేశ్, 2006 డిసెంబరు 25న శృంగేరి తాలూకా కిగ్గాలో దినకర్, 2007 జూలై 10న కొప్ప తాలూకా ఒడెయరమఠ ఎన్‌కౌంటర్‌లో సింధనూరుకు చెందిన గౌతం, కుదురేముఖ్ జాతీయ ఉద్యానవన వ్యతిరేక పోరాట సమితి ప్రధాన కార్యదర్శి పరమేశ్వర, కార్మికుడు సుందరేశ్, ఇంటి యజమాని రామేగౌడ, అతడి భార్య కావేరి, 2008 నవంబరు 20న హొరనాడు సమీపంలోని మామిడితోటలో సొరబకు చెందిన మనోహర్, అతడి అనుచరులు నవీన్, అభిలాష్‌లు, 2010 మార్చి 1న బెళ్తంగడి తాలూకా కొత్తూరు వసంతగౌడ ఎన్‌కౌంటర్‌లు సాగాయి. ఆ తర్వాత 14ఏళ్లపాటు నక్సల్స్ ప్రభావం తగ్గుతూ వచ్చింది. 2024 నవంబరు 18న విక్రమ్‌గౌడ ఎన్‌కౌంటర్ తెలిసిందే.

పలువురి హత్య

2005 మే 17న కొప్ప తాలూకా మెణసినహాడ్య గిరిజన నేత పి శేషయ్య, 2007 జూన్ 3న శృంగేరి తాలూకా కిగ్గ సమీపంలో గండగట్టు అంగడి యజమాని వెంకటేశ్, 2008 మే 15న హెబ్రి సమీపంలో సీతానది ప్రాంత టీచర్ భోజశెట్టి, రైతు సురేశ్‌శెట్టి, 2008 డిసెంబరు 7న హళ్ళి హొళయ, రైతు కేశవ యడియాళ, 2011 డిసెంబరు 28న తెంగినమారుకు చెందిన సదాశివగౌడ హతమయ్యారు.

ప్రభుత్వంపై కక్ష

2005 ఫిబ్రవరి 6న కర్ణాటక మావోయిస్టుల మాస్టర్‌మైండ్ సాకేత్‌రాజన్ ఎన్‌కౌంటర్‌తో నక్సల్స్‌లో ఆగ్రహం పెల్లుబికింది. కాగా ఇందుకు ప్రతీకారంగా అదే నెల 10వ తేదీన పావగడ తాలూకా వెంకటమ్మనహళ్ళిలో ఓ పాఠశాలలో బస చేసిన రిజర్వు పోలీసు బృందంపై మావోయిస్టులు మెరుపుదాడి చేశారు. ఏడుగురు పోలీసులతోపాటు ఓ పౌరుడిని హత్యచేశారు. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకుని పరారీ అయ్యారు. 2007 జూలై 17న ఆగుంబె సమీపంలోని హుల్గారబైలులో ఏఎస్ఐ వెంకటేశ్, 2008 నవంబరు 20న హొరనాడు సమీపంలో మావినహొళె ఎన్‌కౌంటర్‌లో కానిస్టేబుల్ గురుప్రసాద్, 2011 ఆగస్టు 9న బెళ్తంగడి తాలూకా నావూరు గ్రామంలో మంజలలో మహదేవమానెలను హతమార్చారు.

చరమాంకంలో ఇబ్బందిపడ్డ విక్రమ్‌గౌడ

కేరళ నుంచి కర్ణాటకలోని పశ్చిమకనుమల దాకా పేరొందిన మావోయిస్టు నేత విక్రమ్‌గౌడ సాయుధపోరాటం చేయడంలో సామర్థ్యాన్ని కోల్పోయారు. చివరకు ఆకలి తీర్చుకోవడానికి కూడా కష్టతరం అనిపించే పరిస్థితికి చేరారు. రెండు రాష్ట్రాలలో సుదీర్ఘకాలంపాటు మావోయిస్టు నేతగా వ్యవహరించిన విక్రమ్‌గౌడ చివరిరోజుల్లో పలుకష్టాలు పడ్డాడు. ఇతర ప్రాంతాలకు వెళితే మరిన్ని సమస్యలు తప్పవని సొంతూరు సమీపంలోని అటవీప్రాంతంలోనే గడిపారు. విక్రమ్‌గౌడను జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అయితే ప్రజాసంఘాల నేతలకు త్వరితగతిన విక్రమ్‌గౌడను కలుసుకునేందుకు సాధ్యం కాలేదు. అంతలోనే రెండునెలలక్రిందట ఎన్‌కౌంటర్‌లో బలయ్యాడు. అతడి వెంట ఉన్న ఆరుగురు మావోయిస్టులు ఒకేసారి జనజీవనస్రవంతిలోకి చేరుకున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేదనే రీతిలో స్వయంగా ముఖ్యమంత్రి సమక్షంలో మావోయిస్టులు లొంగిపోయారు.



కేపీసీసీ సమావేశంలో డీసీఎం డీకే శివకుమార్

21న బెళగావిలో 'గాంధీ భారత' సమావేశం

బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బెళగావిలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహాత్మాగాంధీ వ్యవహరించిన సమావేశానికి వందేళ్లు సందర్భంగా నిర్వహించ తలపెట్టిన శతాబ్ది ఉత్సవం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో వాయిదా పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో 'గాంధీ భారత' సమావేశాన్ని 21వ తేదీన బెళగావిలో నిర్వహించనున్నట్లు కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ ప్రకటించారు. కేపీసీసీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం' సమావేశాన్ని 21న బెళగావిలో నిర్వహించేలా తీర్మానించినట్లు తెలిపారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి రాష్ట్రంలోని ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఈ సమావేశం ద్వారా గాంధీ భారత కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. 13వ తేదీన ఇందుకు సంబంధించి సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సుర్జేవాలాల నేతృత్వంలో సన్నాహకసభ ఉంటుందన్నారు. కేపీసీసీ సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బ్లాక్‌కాంగ్రెస్ సభ్యులు పాల్గొంటారన్నారు. ఇదే సందర్భంగా పదాధికారుల సభ, సీఎల్పీ భేటీ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి 15, 16 తేదీలలో మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ముందస్తు సభలు నిర్వహించాలని సూచించామన్నారు. గాంధీ భారత కార్యక్రమంలో చారిత్రాత్మక కాంగ్రెస్ సమావేశానికి సంబంధించి ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. తద్వారా గాంధీజీ తత్వాలు కొనసాగించేందుకు దోహదపడేలా ఉపయోగపడనుందన్నారు. సమావేశంలో హోం మంత్రి పరమేశ్వర్, మంత్రులు మునియప్ప, సతీశ్‌జార్కిహొళి, లక్ష్మీ హెబ్బాళ్కర్, కేంద్రమాజీ మంత్రి వీరప్పమొయిలీ పాల్గొన్నారు.

రేణుకా యల్లమ్మ ఆలయానికి రూ.100 కోట్లు

● ఎంపీ జగదీశ్‌శెట్టర్



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ జగదీశ్ శెట్టర్

బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పర్యాటకశాఖ, డెవలెప్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ టూరిస్ట్ సెంటర్ గ్లోబల్‌స్కేల్ పథకం కింద సవదత్తిలోని రేణుకా యల్లమ్మ ఆలయ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరయ్యాయని ఎంపీ జగదీశ్‌శెట్టర్ తెలిపారు. బెళగావిలో దేవదాయశాఖ, పర్యాటకశాఖ అధికారులతో ఎంపీ బుధవారం సమీక్ష జరిపారు. ఆలయంలో అన్ని సౌకర్యాలు ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. అందుకు రూపొందించిన ప్రణాళికలపై చర్చించారు. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో రాజీ ఉండరాదన్నారు. వివిధ అంశాలపై సమగ్ర చర్చలు నిర్వహించారు.

టీబీ డ్యామ్ క్రస్ట్‌గేట్ల పరిశీలన



క్రస్ట్‌గేట్లను పరిశీలిస్తున్న స్టాండింగ్ ఎక్స్‌పర్ట్ అడ్వైజరీ కమిటీ సభ్యులు

బళ్లారి గాంధీనగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి కొత్తగా క్రస్ట్‌గేట్లు ఏర్పాటు చేసే విషయంపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన నిపుణుల కమిటీ మంగళవారం తుంగభద్ర జలాశయాన్ని పరిశీలించింది. స్టాండింగ్ ఎక్స్‌పర్ట్ అడ్వైజరీ కమిటీ డ్యామ్‌కు కొత్తగా క్రస్ట్‌గేట్ల ఏర్పాటు బాధ్యత తీసుకుంది. జలాశయ నిర్మాణం, తదితర విషయాలకు సంబంధించి బోర్డు అధికారుల నుంచి సమాచారం సేకరించారు. వచ్చే వర్షాకాలం నాటికి మొదటి దశలో ఎన్ని గేట్లు అమర్చాలి, ఎలా అమర్చాలనే విషయంపై కమిటీ నిర్ణయించనుంది. గేట్ల ఏర్పాటు సంబంధించి వచ్చే రోజుల్లో కమిటీ పూర్తి బాధ్యత వహించనున్నట్లు బోర్డు అధికారులు వివరించారు. కేంద్ర జలవనరుల కమిషన్ మాజీ చీఫ్ ఇంజనీర్ టి.కె.శివరాజన్ నేతృత్వంలోని బృందం ఎస్‌ఎచ్‌వీసీ మాజీ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్.పి.ముఖర్జి, కర్ణాటక సాంకేతిక ఉపసమితి అధ్యక్షులు ఎస్.బి.సిద్ద గంగప్ప, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బి. శ్రీనివాస్ రావ్, విజయవాడకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.కె.విజయసారథి, తెలంగాణకు చెందిన సూపరింటెండెంగ్ ఇంజనీర్ మొహ్మద్ రహీముద్దీన్, తుంగభద్ర మండలి అధ్యక్షులు ఎస్.ఎన్.పాండే, కార్యదర్శి ఓ.ఆర్.కె రెడ్డి, చీఫ్ ఇంజనీర్ హనుమంతప్ప దాసర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రవిచంద్ర, ఎస్ఎల్‌సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణనాయక్, వివిధ విభాగాల ఇంజనీర్లు జ్ఞానేశ్వర్, విశ్వనాథ్, రాఘవేంద్రలు ఈ బృందంలో ఉన్నారు. ఈ ఏడాది జూన్ నెలలో మొదట తాత్కాలిక గేట్ ఏర్పాటు చేసిన 19వ గేట్‌తో పాటు మరికొన్ని గేట్లు మార్చే కార్యచరణను చేపట్టనున్నారు.

లోకాయుక్త దాడులు

బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇంట్లో తనిఖీలు

బళ్లారి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం ప్రభుత్వ అధికారి ఇంటి పై లోకాయుక్త అధికారులు దాడిచేశారు. ఆదాయానికి మంచి ఆస్తులు ఉన్నాయనే కారణంతో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఆర్.హెచ్ లోకేష్ ఇంటిపై దాడిచేశారు. ఇంద్రభవనం లాంటి ఇంట్లో లోకాయుక్త అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ విలువైన వస్తువులు, పత్రాలు లభించాయి. అయితే అధికారులకు తొలిత గుండుసూదంత బంగారు కూడా దొరక్కపోవడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. చివరకు సినిమా తరహాలో ఇళ్లంతా అన్ని చోట్లా వెతికారు. చివరకు 120 తులాల బంగారం ఒకచోట లభించింది. లోకాయుక్త పోలీసులకు దొరికిన ఆస్తులు రూ.1,25,00,000, ప్లాట్లు 2 రూ.15,20,688 భూమి ఆరుఎకరాలు రూ.6,06,500, నగదు రూ .9,100, బంగారం 120.51 గ్రాములు, టోయోటా ఇన్నోవా రూ.15,00,000, రాయల్ ఇన్‌ఫీల్డ్ రూ.1,15,000 ఇలా ఆదాయానికి మించిన ఆస్తులు అధికారి ఇంట్లో లభించాయి. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు లోకాయుక్త ఎస్పీ సిద్దరాజు తెలిపారు.



లోకాయుక్త అధికారులు దాడిచేసిన అధికారి ఇల్లు



టీటీడీ ఆలయం వద్ద మండపం ఏర్పాట్లు

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలు, శ్రీనివాసమందిరాలలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వయ్యాలికావల్‌లోని టీటీడీ ఆలయంలో భక్తుల రద్దీని పురస్కరించుకుని బారికేడ్‌లతోపాటు పలు సౌకర్యాలు సిద్ధం చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత అన్ని ఆలయాల్లో వైకుంఠద్వార దర్శనం కోసం సిద్ధం చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలనుంచే భక్తులకు వైకుంఠద్వారం గుండా దర్శనం చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. టీటీడీ ఆలయంలో ఉదయం 3 గంటల నుంచి నైవేద్యంతో దైవదర్శనం ప్రారంభం అవుతుందని స్థానిక ఏఈఓ బాలరాజు, సూపరింటెండెంట్ జయంతి తెలిపారు. రాత్రిదాకా నిరంతర కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఉదయం 9, సాయంత్రం 4 గంటలకు నైవేద్యం బ్రేక్ ఉంటుందని, అరగంటపాటు దర్శనానికి అంతరాయం ఉంటుందన్నారు. వేదపారాయణం, నాదస్వరం, గీతాపారాయణం, భరతనాట్యం, భజన, హరికథ తదితర కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా బారికేడ్‌లు, తాగునీరు తదితరన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.



మీడియాతో ఏఈఓ, సూపరింటెండెంట్

జయనగర్‌లోని శ్రీనివాసమందిరంతోపాటు రాజాజీ నగర్, కనకపుర రోడ్డు కోణనకుంటె క్రాస్‌లోని ఇస్కాన్ మందిరాలలో వైకుంఠద్వార దర్శనం కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇస్కాన్ మందిర ప్రముఖులు ప్రకటించారు. నగరంలోని వివిధ ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో వైకుంఠదర్శనాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. శరవణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశిన భక్తులకోసం లక్ష లడ్డూలు సిద్ధం చేసినట్లు జేడీఎస్ ఎమ్మెల్సీ శరవణ తెలిపారు. బుధవారం తయారైన లడ్డూలను ప్రదర్శించారు. వందమంది వంటమనుషులు కొన్నిరోజులుగా లడ్డూలను తయారు చేస్తున్నారన్నారు. శుద్ధమైన నెయ్యితోపాటు ఇతరత్రా పదార్థాలను వినియోగించి నాణ్యతలో రాజీ పడకుండా తయారు చేశామన్నారు. నగర పరిధిలోని ఆలయాలకు లడ్డూలను అందిస్తామన్నారు.



లడ్డూలకు హారతి ఇస్తున్న ఎమ్మెల్సీ శరవణ

జిల్లా కేంద్రంలో కలగలిసినట్లు ఉండే మండలం బుక్కరాయసముద్రం. ఇందులోని ఓ పంచాయతీ సిద్దరాంపురం. ఈ గ్రామంలో దాదాపు ఏడు వందల ఇళ్లు ఉన్నాయి. మొత్తం జనాభా దాదాపు మూడు వేలు ఉన్నారు. ఇక్కడి ప్రజలకు పాడి, వ్యవసాయమే ప్రధానం. ప్రతి గ్రామంలో ఉన్నట్లే ఈ గ్రామంలోనే అనేక సమస్యలు ఉన్నాయి. ఈ ఊరి గురించే ఎందుకు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి వస్తోందంటే.. ఇది శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ స్వగ్రామం. తమ ఊరి ఆడబిడ్డ తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. సొంతూరిపై మమకారంతో ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తారని ఆ ఊరి ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే తండ్రి బండారు రవికుమార్ స్వగ్రామం సిద్దరాంపురం. వృత్తి రీత్య కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. తర్వాత కాలం అంటే 2014 నుంచి ఎమ్మెల్యేతో పాటు వారి కుటుంబ సభ్యులు స్వగ్రామం తో పాటు అనంతపురంలో నివసిస్తున్నారు. స్వగ్రామంలో సొంత ఇల్లు, భూమి ఉంది. ఈ నేపథ్యంలో ఆ గ్రామాన్ని 'ఆంధ్రజ్యోతి' బుధవారం సందర్శించింది. అక్కడి ప్రజలతో మాట్లాడి.. ఊరి పరిస్థితిని తెలుసుకుంది.

- ఆంధ్రజ్యోతి, బుక్కరాయసముద్రం



ఆంధ్రజ్యోతి విజిట్

సిద్ధరాంపురం.. సమస్యల తోరణం

- అభివృద్ధి కోసం ఎమ్మెల్యే స్వగ్రామం ఎదురుచూపు
- గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయం
- ఇళ్లు, స్థలాల కోసం పేదల నిరీక్షణ
- చెరువు నింపాలని రైతుల వినతి
- నిరుద్యోగ సమస్య తీర్చాలంటున్న యువత


ప్రాథమిక పాఠశాల ఎదుటే మురుగునీటి కాలువ


గుంతలపడిన సిద్దరాంపురం ప్రధాన రహదారి

గుంతల రోడ్డే గతి

మండలకేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది సిద్దరాంపురం. పచ్చని పైరు పంటలు, పాడితో విలసిల్లిన గ్రామం కాలగతిలో వచ్చిన మార్పులకు తలవంచింది. ఎందరో పాలకులు మారిన గ్రామస్థితి గతులు మార్చలేకపోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బుక్కరాయసముద్రం నుంచి సిద్దరాంపురం గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు గుంతలమయంగా ఉంది. గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. అనంతపురం నుంచి సిద్దరాంపురం వెళ్లడానికి గతంలో ఆర్టీసీ బస్సు ఉండేది. ప్రస్తుతం ఆ బస్సు సర్వీసు నడపడం లేదు.

చెరువుకు నీరు నింపితే.. వ్యవసాయం మరింత మెరుగు



సిద్దరాంపురం గ్రామ చెరువును నీటితో నింపితే వ్యవసాయం రంగం మరింత పుంజుకుంటుంది. హంద్రీనీవా ద్వారా, లేదా బుక్కరాయసముద్రం చెరువు ద్వారా నీరు నింపేలా ప్రభుత్వం చొరవ చూపాలి. మా ఎమ్మెల్యేకు చెరువు నీరు విషయం తెలిపాం. ఈ విషయంపై పోరాడి చేస్తానని చెప్పారు. చెరువులోకి నీరు వస్తే గ్రామంలోని వ్యవసాయ బోర్లు, తాగునీటి బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయి.

- సంజప్ప సిద్దరాంపురం

స్థలాల కోసం ఎదురుచూపులు

ఎమ్మెల్యే స్వగ్రామంలో పక్కాగృహాలు, ఇంటి పట్టాలు కోసం ఎస్సీ, బీసీలు ఎదురు చూస్తున్నారు. ఇళ్లు లేకపోవడంతో చాలా మంది ఏళ్లుగా చిన్న ఇంట్లోనే 8, 9 మంది నివాసం ఉంటున్నారు. దేవుడి మాన్యం భూమిలో ఇంటి పట్టాలు ఇవ్వాలని గతంలో అధికారులుకు పలు సార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇంటి స్థలాలు కోసం, పక్కాగృహాలు కోసం గ్రామంలో దాదాపు వంద మందికిపైగా అర్హులు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి ఇంటి స్థలాలు, పక్కాగృహాలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయంలో పక్కాగృహాలు కావాలని 20 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రూ. 26 లక్షలతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం బండారు శ్రావణీశ్రీ తన స్వగ్రామ పంచాయతీలో రూ.26 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో మరి కొన్నిపనులుకు ప్రతిపాదనలు పంపారు.

డెయిరీ ఏదీ..?

సిద్దరాంపురం గ్రామ పంచాయతీలో పాడిపరిశ్రమపై 150 కుటుంబాలకు పైగా ఆధార పడి జీవిస్తున్నారు. ప్రతి రోజూ వేల లీటర్లు ఈ గ్రామ పంచాయతీ నుంచి అనంతపురం తరలించి విక్రయిస్తుంటారు. ఇది చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న పని. గ్రామ పంచాయతీలోనే ప్రభుత్వం ఓ డెయిరీని ఏర్పాటు చేసి, పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పాడి రైతులు కోరుతున్నారు.

జాబ్‌మేళా నిర్వహించాలి: రాంప్రసాద్



నేను పీజీ వరకు చదివా. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కోసం ప్రయత్నించి విఫలమయ్యా. దీంతో ఉన్న ఊరిలోనే ఇంటి వద్ద గాలి మిషన్ పెట్టుకుని జీవిస్తున్నా. నా భార్య నారక్క డిగ్రీ పూర్తి చేసింది. ఇద్దరం కలిసి గాలి మిషన్ ద్వారా బతుకుతున్నాం. మాకు పక్కా ఇల్లు కూడా లేదు. ఎమ్మెల్యే గారు ఏదైనా జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ సమస్య పరిష్కారించాలి.


ఊరి కాలువ గట్టు మీద విద్యార్థుల నడక

ఇల్లు కూలిపోయింది..



2007లో ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్నా. అయితే గతంలో కురిసిన వర్షాలకు అది నేలమట్టం అయ్యింది. ఐదేళ్ల నుంచి చిన్న బాడుగ ఇంట్లో ఉంటున్నా. పక్కా ఇంటి కోసం అధికారులు చుట్టూ తిరిగినా మంజూరు చేయలేదు. చిన్న ఇంటిలోనే నా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, మా అమ్మ, నా భార్య మొత్తం ఆరుగురు ఉంటున్నాం. చిన్న ఇంటిలో జీవనం ఇబ్బందిగా ఉంది. ఎమ్మెల్యేగారు కనికరించి నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.

- నారాయణస్వామి, సిద్దరాంపురం

చెరువుకు సాగునీరు... ఎమ్మెల్యేకు సవాల్

సిద్దరాంపురం గ్రామ చెరువును నీటితో నింపడం ఎమ్మెల్యేకు సవాల్‌తో కూడుకున్న పని. 2015లో ఈ చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేశారు. రూ.30లక్షలతో సప్లై చానల్ పనులు కూడా చేపట్టారు. అయితే సాంకేతికపరమైన చిక్కులు రావడంతో పనిని ఆపివేశారు. ప్రస్తుతం బుక్కరాయసముద్రం చెరువు ద్వారా ఓ సప్లై చానల్ ఏర్పాటు చేసి, దాని ద్వారా సిద్దరాంపురం చెరువును నింపాలని ఆ గ్రామంలోని రైతులు గతంలో అధికారులను కోరారు. ఇందుకు రూ. 10 కోట్ల పైగా ఖర్చు అవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేయడం జరిగింది. మరి ఇంత మొత్తం ఒక్క పంచాయతీకే రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి, చెరువును నీటితో నింపడం ఎమ్మెల్యేకు సవాల్‌తో కూడుకున్న విషయమే.

ఊరి కాలువ సమస్య

గ్రామంలో నిరుద్యోగ సమస్య, ఎస్సీ, బీసీలుకు ఇంటి స్థలా లు, పక్కాగృహాలు సమస్య తీవ్రంగా ఉంది. వీటితో పాటు రైతులు అనేక సంవత్సరాల నుంచి గ్రామంలో ఉన్న చెరువుకు సాగునీరు అందిస్తుందని రైతులు ఎదురు చూపులు చూ స్తున్నారు. గతంలో వేసి న రోడ్లు, డ్రైనేజీ కాలువల సమస్య పెద్దగా లేకపోయినా, ఎస్సీకాలనీ, ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న ఊరి కాలువ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామ పంచాయతీ హాబిటేషన్ గ్రామం అయిన ఏ కొండాపురం గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. ఈ గ్రామ పంచాయతీలో దాదాపు పాడి పరిశ్రమం మీద దాదాపు 150 కుటుంబాలు పైగా ఆధార పడి జీవనం సాగిస్తున్నాయి. స్థానికంగా డెయిరీ లేకపోవడంతో ప్రతి నిత్యం పాలను అనంతపురం తెచ్చి విక్రయించాల్సిన పరిస్థితి. ఇలా ఎమ్మెల్యే స్వగ్రామంలో సమస్యలు అనేకం ఉన్నాయి. రానున్న ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యే సొంతూరి సమస్యలపై దృష్టి పెట్టి, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారు.

నిరుద్యోగ సమస్య తీవ్రం

ఎమ్మెల్యే స్వగ్రామంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో ఇంటర్, డిగ్రీ, పీజీ చేసిన యువత అనేక మంది ఖాళీగా ఉన్నారు. గ్రామంలో ఏదైనా ఫ్యాక్టరీ పెట్టడం లేదా జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

రేపటి నుంచే సంక్రాంతి సెలవులు

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని స్కూళ్లకు శుక్రవారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. 2024-25 అకడమిక్ క్యాలెండర్ మేరకు ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకూ స్కూళ్లకు సెలవులు ఉంటాయన్నారు. సెలవుల్లో 10వ తరగతి విద్యార్థులు యాక్షన్ ప్లాన్ మేరకు 10 నుంచి 12 తేదీ వరకూ, 16 నుంచి 19వ తేదీ వరకూ పరీక్షలకు సెల్ఫ్ ప్రిపరేషన్ కావాలని సూచించారు. 20వ తేదీ స్కూళ్లు పునఃప్రారంభమవుతాయన్నారు. మైనార్టీ విద్యాసంస్థలకు ఈనెల 11 నుంచి 15 వరకూ సెలవులు ఉంటాయని డీఈఓ పేర్కొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

గుంతకల్లు టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఎస్కే యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు బుధవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు అటానమస్ హోదా వచ్చిన తరువాత తొలిసారిగా సెమిస్టర్ పరీక్షలు డిసెంబరు 2024లో నిర్వహించారన్నారు. ఈ పరీక్షలను మొత్తం 425 మంది రాయగా 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డీపీ మురళీకృష్ణ, డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సురేష్‌బాబు, గోపి, కురిపాటి రాకేష్, తదితరులుపాల్గొన్నారు.

ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో... పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో బుధవారం కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్త ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 304 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 183 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

70 ధాన్యం బస్తాలు లాగిన ఒంటెద్దు


ఒంటెద్దు బండిపై ధాన్యం బస్తాలను తరలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) కాడెద్దుల సేద్యం కనుమరుగవుతోంది. మేడిపట్టే రైతు మాయమవుతున్నాడు. ఇలాంటి తరుణంలో ఒక రైతు తన ఒంటెద్దుతో ఐదు బండ్లలోనిల్లో 70 వరి ధాన్యం బస్తాలను ఒక కిలోమీటర్ వరకు లాగించి ఔరా అనిపించాడు. ఈ సంఘటన మండలంలోని దేవగిరి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన రైతు దేవప్పగారి ఆంజనేయులు తన తోటి రైతులతో సరదాగా తన ఎద్దు సామర్థ్యం గురించి మాట్లాడాడు. ఈక్రమంలోనే ఒంటెద్దుతో 70 ధాన్యం బస్తాలు తరలించడానికి పూనుకున్నాడు. తను ఒంటెద్దుకు జతగా కాడిమానుకు ఒక పక్క ఉండి 70 ధాన్యం బస్తాలు వేసుకోని వచ్చారు. దీన్ని చూసేందుకు ఊరంతా వచ్చారు. ఎద్దు కూడా ఏమాత్రం అలసలేకుండా బండిలాగింది. రైతు ఆంజనేయులు పక్కన మరికొంత మంది ఉండి బండిని తోయించారు. రైతు చేసిన ఈ సాహసాన్ని టీడీపీ నాయకులు అప్పారావు, గ్యాస్ గోవింద అభినందించారు.

అభిమానులూ.. జాగ్రత్త

- బాలకృష్ణ ఫ్యాన్స్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి
- నేడు డాకు మహరాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్
- హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్


ఎస్పీతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో స్వీయ నియంత్రణ, క్రమశిక్షణగా ఉండాలని అభిమానులు, కార్యకర్తలకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. శ్రీనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో జిల్లా ఎస్పీ జగదీష్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, బాలకృష్ణ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు జగన్‌తో కలిసి బుధవారం ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీఐపీలు, ప్రజాప్రతినిధుల గ్యాలరీలు, అభిమా నుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ జగదీష్‌తో ఏర్పా ట్లు, భద్రతా చర్యలపై ఆరా తీశారు. తమ అభిమాన హీరో బాలకృష్ణ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తన నియోజకవర్గంలో జరగడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరవుతారని తెలిపారు.

పటిష్ట బందోబస్తు

అనంతపురం క్రైం: నగరంలోని శ్రీనగర్‌కాలనీలో నిర్వహిస్తున్న డాకు మహరాజ్ ఈవెంట్‌కి సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి 25వేల మంది వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. పాసులున్న వారు మాత్రమే ప్రాంగణంలోకి రావాలని సూచించారు. డాకూ మహరాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమం నిర్వహణకు సమయం దగ్గర పడుతున్నా వేదిక, ఇతర ఏర్పాట్ల విషయంలో ఇంకా చాలా పని పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 18 నుంచి 20 ఐచర్లకు సంబంధించి బారికేడ్లు తరలించాల్సి ఉందని పోలీస్‌వర్గాలు చెబుతున్నాయి. కానీ ఇప్పటి వరకు 8 నుంచి 10 వాహనాల బారికేడ్లనే తెప్పించినట్లు తెలుస్తోంది. వేదిక కాకుండా సెలబ్రిటీ గ్యాలరీ 300మందికి ఏర్పాటు చేయాల్సి ఉంది. మోస్ట్ ఇంపార్టెంట్ పర్సన్(ఎంఐపీ) విభాగంలో 4వేల మందికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇక జనరల్ గ్యాలరీ (అన్‌లిమిటెడ్)పేరుతో కుర్చీలు లేకుండా మరో విభాగం ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికి ప్రత్యేకంగా బారికేడ్లు తప్పనిసరి. లేకపోతే పరిస్థితి ఆందోళనకరంగా ఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

నేడు జిల్లాకు మంత్రి నారా లోకేశ్ రాక



అనంతపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం జిల్లాకు రానున్నారు. రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నారాలోకేశ్ జిల్లాకు తొలి సారిగా వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకత్వం భారీగా స్వాగత ఏర్పాట్లు చేస్తోంది. ఇదిలా ఉండగా.. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన హాజరవుతున్నారు. మధ్యాహ్నం 3.20 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి సాయంత్రం 4.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి నారాలోకేశ్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 6 గంటలకు అనంతపురం నగర శివారులోని శ్రీనగర్ కాలనీ సమీపంలో ముత్యాలరెడ్డి కంపౌండ్‌లో ఏర్పాటు చేసిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికకు చేరుకుంటారు. ఆ కార్యక్రమం అనంతరం రాత్రి 9 గంటలకు అనంతపురం నుంచి కర్నూలుకు బయలుదేరి వెళతారు. ఈ నేపథ్యంలో నారా లోకేశ్ పర్యటన, ప్రీరిలీజ్ ఈవెంట్ విజయవంతం చేయడానికి జిల్లా నాయకులు శ్రమిస్తున్నారు.

ప్రైవేటుకు దీటుగా అహుడా ఎంఐజీ లే అవుట్‌లు

- అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వెంచర్లకు దీటుగా అహుడా పరిధిలో ఎన్టీఆర్ టౌన్‌షిప్ పేరుతో ఎంఐజీ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. అహుడా కార్యాలయంలో బుధవారం ఆయన అహుడా వైస్ ఛైర్మన్ శివ్‌నారాయణ శర్మ, అధికారులతో కలిసి కూడేరు, గుత్తి, మడకశిర ప్రాంతాల్లో వేసిన ఎంఐజీ లేఅవుట్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ఎంఐజీ లేఅవుట్లను అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. లేఅవుట్లలో 40 అడుగుల సీసీ రోడ్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్, ఇఎల్ఎస్ఆర్‌తో నీటి సరఫరా, సీవెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ)తో భూగర్భ మురుగు కాలువ పైపులైన్లు, కరెంటు సదుపాయాలు, వర్షపు నీటి కాలువ, వీధి దీపాలు, పార్కులు వంటి అభివృద్ధి పనులతో వసతులుంటాయన్నారు. వైస్ ఛైర్మన్ శివ్ నారాయణ శర్మ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఆ దిశగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ మూడు లేఅవుట్లను ఏడాదిలోపు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఎవరైనా డబ్బు మొత్తం ఒకేసారి చెల్లిస్తే 5శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, సెక్రటరీ గౌరీశంకర్‌రావు, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, ఈఈ రేవంత్‌రెడ్డి, సర్వేయర్ శరత్‌బాబు, ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు ప్రమీల, నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైనల్లో బెంగళూరు-నర్మదావ్యాలీ

మూడో స్థానం కోసం ఏఎస్ఏ పోటీ


గుజరాత్, నర్మదావ్యాలీ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో బెంగళూరు, నర్మదావ్యాలీ జట్లు ఫైనల్‌కు చేరాయి. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ ఇన్‌స్పైర్ అండర్-17 జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు బుధవారం నాలుగోరోజు కొనసాగాయి. నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ జట్ల మధ్య జరిగిన పోరు డ్రాగా ముగిసింది.

ఫాల్కన్ గర్ల్స్ ఒడిశాపై కంపాసిన్ 3గోల్స్, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై పెన్నా ఏపీ 8గోల్స్, స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నైపై బెంగళూరు 2గోల్స్, థామ్ తమిళనాడుపై అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ జట్టు 3గోల్స్, నందిఫౌండేషన్ గుజరాత్‌పై లిబర్టీ లేడీస్ తమిళనాడు జట్లు 6గోల్స్ తేడాతో విజయం సాధించాయి. పాయింట్ల పట్టిక ఆధారంగా 15పాయింట్లతో ఉన్న బెంగళూరు, 13పాయింట్లతో ఉన్న నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్ జట్లు గురువారం నిర్వహించే ఫైనల్ పోరులో తలపడనున్నాయి. తరువాత స్థానంలో ఉన్న అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ 10పాయింట్లు, స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నై మధ్య తృతీయ స్థానం కోసం జరిగే పోరులో తలపడనున్నాయి.

సమస్యలకు పరిష్కారం చూపని సదస్సులు

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- ఫిర్యాదులు 6,524... పరిష్కారం 1,684
- ఆశించిన స్థాయిలో కనిపించని ఫలితం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్(ఫైల్)

అనంతపురం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యే సదస్సులకు ఫిర్యాదులు వేలల్లో వచ్చాయి. దాదాపు 33 రోజుల పాటు నిర్వహించిన సదస్సుల్లో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో సాధ్యమైనవాటికి అక్కడే పరిష్కారం చూపారు. అయితే ఆశించిన స్థాయిలో కాదు. సదస్సులు ముగిసినా వేల సంఖ్యలో సమస్యలు పెండింగ్‌లో ఉండిపోయాయి.

6,524 ఫిర్యాదులు... 1,684 పరిష్కారం

అధికారుల లెక్కల ప్రకారం డిసెంబరు 6 నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు మొదలు పెట్టారు. మొత్తం 503 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఇవి బుధవారంతో ముగిశాయి. అధికారులు రికార్డుల ప్రకారం మొత్తం 6,524 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో అనంతపురం డివిజన్‌లో 2,510, గుంతకలు డివిజన్‌లో 2,577, కళ్యాణదుర్గం డివిజన్‌లో 1,437 ఫిర్యాదులు అందాయి. అత్యధికంగా ఆర్ఆర్ఆర్, సరిహద్దులు, రీసర్వేలో తప్పులు, ఆన్‌లైన్‌లో భూరికార్డులు అక్రమంగా మార్పులు, భూఆక్రమణలు తదితర వాటిపై ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. తమ భూ సమస్యలన్నీ ఈ సదస్సుల ద్వారా పరిష్కారం అవుతాయని ఆశించిన బాధితులకు నిరాశే మిగిలిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన ఫిర్యాదులలో 1,684 మాత్రమే పరిష్కరించి నట్లు అధికారులు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకోగా భూసమస్యలున్న రైతులు మాత్రం నిట్టూరుస్తున్నారు. మొత్తంమీద రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

హర్ గోవింద్ ఖోరానా (జయంతి)



నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవశాస్త్రజ్ఞుడు హర్ గోవింద్ ఖోరానా 1922 జనవరి 9న అప్పటి పంజాబ్ పరిధిలోని రాయ్‌పూర్‌లో జన్మించారు. భారత సంతతికి చెందిన అమెరికన్ జీవశాస్త్రజ్ఞుడు. ఉత్తర అమెరికాలోని మూడు యూనివర్శిటీలకు ఫ్యాకల్టీగా వ్యవహరించారు. మూడు న్యూక్లియోటైడ్‌ల అమరికతో జన్యువులు పొందుపరచబడి ఉన్నాయని కనుక్కొని కృత్రిమ జీన్ (డీఎన్ఏ)ను ప్రయోగశాలలో సృష్టించారు. ఆధునిక జీవశాస్త్రములో విప్లవం సాధించి 1968లో 'నోబెల్ ప్రైజ్' గెలుపొందారు. 1987లో 'నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్' అందుకున్నారు. 2011 నవంబరు 9న కన్నుమూశారు.

పాల్ఘాట్ రఘు (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు 'పద్మశ్రీ' గ్రహీత పాల్ఘాట్ రామస్వామి రఘు 1928 జనవరి 9న బర్మాలోని రంగూన్‌లో (ప్రస్తుతం మయన్మార్‌లోని యాంగోన్) జన్మించారు. పండిట్ రవిశంకర్, హరిప్రసాద్ చౌరాసియా, శివకుమార్ శర్మ వంటి ప్రముఖులతో కలసి దేశ విదేశాలలో కచేరీలు ప్రదర్శించారు. వెస్లియన్, శాండిగో, కాలిఫోర్నియా యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. ప్రత్యేకించి మృదంగం విద్యార్థులకు తరగతులు నిర్వహించేవారు. సంగీత నాటక అకాడమీ, కలైమామణి, తదితర పురస్కారాలు అందుకున్నారు. 2009 జూన్ 2న కన్నుమూశారు.

మహేంద్రకపూర్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత మహేంద్రకపూర్ 1934 జనవరి 9న అమృత్‌సర్‌లో జన్మించారు. నేపథ్యగాయకుడిగా దాదాపు ఐదు దశాబ్దాలపాటు హిందీతోపాటు గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, మరాఠీ అనేక ప్రాంతీయ భాషలలో వేలకొద్దీ పాటలు పాడారు. గుమ్రాహ్, హమ్‌రాజ్ సినిమాల పాటలు ఎంతో పేరొందాయి. మనోజ్‌కుమార్ నటించిన 'ఉప్‌కార్' సినిమాలో పాడిన దేశభక్తి గీతం జాతీయ గుర్తింపు పొందింది. పలు అవార్డులు అందుకున్నారు. 2008 సెప్టెంబరు 7న కన్నుమూశారు.

ఫరా ఖాన్ (పుట్టినరోజు)



ఫరా ఖాన్ 1965 జనవరి 9న ముంబైలో జన్మించారు. బాలీవుడ్‌లో దర్శకురాలిగా, నిర్మాతగా, నటిగా, నృత్యకారిణిగా, కొరియోగ్రాఫర్‌గా పేరొందారు. 80కుపైగా సినిమాలలో వందకుపైగా పాటలకు కొరియోగ్రఫీ అందించారు. ఒక జాతీయ, ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. తమిళ సినిమాల తోపాటు అంతర్జాతీయ ప్రాజెక్టులలోనూ పని చేశారు. మైఖేల్‌జాక్సన్ 'థ్రిల్లర్'తో స్ఫూర్తి పొంది నృత్యంవైపు ఆకర్షితులయ్యారు. బుల్లితెరపై పలు కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు.

ఫర్హాన్ అక్తర్ (పుట్టినరోజు)



ఫర్హాన్ అక్తర్ 1974 జనవరి 9న ముంబైలో జన్మించారు. హిందీ సినీరంగంలో పేరొందిన జావేద్ అక్తర్ కుమారుడు. తండ్రి బాటలో స్క్రీన్‌రైటర్‌గానే కాక నటుడు, దర్శకుడు, నేపథ్యగాయకుడు, నిర్మాతగా, బుల్లితెర వ్యాఖ్యాత ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. 'ది ఫకీర్ ఆఫ్ వెనిస్' సినిమాతో కెరీర్ ప్రారంభించారు. 4 ఫిల్మ్‌ఫేర్ అవార్డులతోపాటు ఉత్తమ సపోర్టింగ్ యాక్టర్ పురస్కారం పొందారు.

హిమాదాస్ (పుట్టినరోజు)



హిమాదాస్ 2000 జనవరి 9న జన్మించారు. అస్సోం రాష్ట్రానికి చెందిన స్ప్రింటర్. అభిమానులచే 'ఢింగ్ ఎక్స్‌ప్రెస్'గా పిలువబడ్డారు. 2018 ఏషియన్ గేమ్స్‌లో 400 మీటర్ల పరుగు విభాగంలో సత్తా చాటుకున్నారు. ఐఏఏఎఫ్ వరల్డ్ అండర్ 20 ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్‌గా బంగారుపతకం సాధించారు. 2018లో 'అర్జున' అవార్డు పొందారు. అస్సోం పబ్లిక్ సర్వీస్ కమిషన్‌చే 2021లో పోలీసు శాఖలో నేరుగా డీఎస్పీ హోదాతో నియమితుల య్యారు.

రెండు వారాలు ఆగండి.. అన్నీ సెటిల్ చేస్తాం

డీకే శివకుమార్‌కు అధిష్ఠానం భరోసా

బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనూహ్యంగా మారిన రాజకీయాలు ఢిల్లీలో హల్‌చల్ చేశాయి. ఆరురోజులక్రిందట మంత్రి సతీశ్ జార్కిహొళి నివాసంలో విందు కొనసాగడంతో రాజకీయంగా చర్చ జోరందుకుంది. కేబినెట్ భేటీ జరిగిన రోజే రాత్రి సీఎంతోపాటు పలువురు మంత్రులకు సతీశ్‌జార్కిహొళి విందు ఏర్పాటు చేశారు. రాజకీయంగా కీలకమైన అంశాలపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే పాల్గొన్నవారెవ్వరూ ఎటువంటి చర్చలు జరగలేదని దాటవేస్తున్నారు. ఈలోగానే టర్కీ పర్యటనకు వెళ్లి రెండురోజులక్రిందట బెంగళూరుకు వచ్చిచ ఆ వెంటనే ఢిల్లీ వెళ్లిన డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అగ్రనేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఇలా సాగుతుండగానే బుధవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, మంత్రులకు హోం మంత్రి పరమేశ్వర్ విందుకు ఆహ్వానించారు. వరుస విందులు ఒకవైపు రాజకీయాలకు కేంద్రంగా మారుతుండడాన్ని డీకే శివకుమార్‌తోపాటు ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలాలకు తాజా రాజకీయ పరిణామాలను వివరించారు. దీంతో సుర్జేవాలా సీరియస్‌గా పరిగణించినట్టు తెలుస్తోంది. రెండువారాలు ఆగాలని, అన్నింటినీ సెటిల్ చేస్తామని డీకే శివకుమార్‌కు పార్టీ అధిష్ఠానం భరోసా ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం జరగాల్సిన హోం మంత్రి పరమేశ్వర్ విందుకు చెక్ పెట్టారు. మలేషియా పర్యటన ముగించుకుని విందు ఏర్పాట్లుకోసం హడావుడిగా వచ్చిన పరమేశ్వర్‌కు అధిష్ఠానం సందేశం షాక్ ఇచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ విందు జరపరాదని హెచ్చరించినట్టు తెలుస్తోంది. అందుకే బుధవారం జరగాల్సిన విందు ఒక్కసారిగా వాయిదాపడింది. అయితే పరమేశ్వర్ మాత్రం విందు రద్దు కాలేదని తాత్కాలికంగా మాత్రమే వాయిదా పడిందని బదులిచ్చారు. అయితే సహకారశాఖ మంత్రి రాజణ్ణ మాత్రం విందు రద్దు కావడంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. మేం విందు చేసుకుంటే డీకే శివకుమార్‌కు ఏం నష్టమని, ఆయన ఆస్తులేమైనా అడిగామా అంటూ ప్రశ్నించారు. ఈ వివాదంపై మంత్రి రాజణ్ణ మినహా మరెవ్వరూ మాట్లాడలేదు.

బీజీఎస్ విద్యాసంస్థలకు ప్రతిష్టాత్మక పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారంతో ప్రకాశనాథస్వామిజీకి సత్కారం

బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సమగ్రమైన సేవలు అందించినందుకుగాను బిజిఎస్ అండ్ ఎస్‌జెబి గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ప్రకాశనాథస్వామిజీకి కర్ణాటక రాష్ట్ర శాస్త్రీయ పరిశోధనా పరిషత్ ఆధ్వర్యంలో జీవితసాఫల్య పురస్కారం 2024ను ప్రదానం చేశారు. కెంగేరిలోని బిజిఎస్ పాలనా కార్యాలయంలో పరిషత్ అధ్యక్షుడు హులికల్ నటరాజ్ ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందచేశారు. అనంతరం హులికల్ నటరాజ్ మాట్లాడుతూ త్రివిధ దాసోహం ద్వారా ఆదిచుంచనగిరి మఠం బాలగంగాధరనాథస్వామిజీ కలలను ప్రకాశనాథస్వామిజీ సాకారం చేస్తున్నారన్నారు. బిజిఎస్ సంస్థ మర్రిచెట్టులా విస్తరించడంలో ప్రకాశనాథ స్వామిజీ సేవలు కీలకమన్నారు. పురస్కారం పొందిన అనంతరం డాక్టర్ ప్రకాశనాథస్వామిజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, డీన్‌లు, సిబ్బంది అందరి సహకారంతోనే అవార్డు సాధ్యమైందన్నారు. బాలగంగాధరనాథస్వామిజీ ఆశయాలకు అనుగుణంగా కొనసాగుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ మనోభావాలు చాటుతున్న పరిషత్‌కు బిజిఎస్ నుంచి వార్షిక గరిష్ఠమొత్తం రూ.5లక్షలు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశనాథస్వామిజీని పలువురు అభినందించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, మెడికల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు డాక్టర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలలను సాకారం చేసుకోవాలి



మంథన్ సన్నాహకసభలో ఎంపీ డాక్టర్ మంజునాథ్ తదితరులు

ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్

బెంగళూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కలల సాధనకై పారిశ్రామికవేత్తలు రాణించాలని తద్వారా ఉద్యోగ, ఉపాధితోపాటు జాతీయసంపద వృద్ధి సాధ్యమని బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. ఎఫ్‌కెసిసిఐ బుధవారం ఏర్పాటు చేసిన మంథన్ 17వ విడత సదస్సు సన్నాహకసభలో ముఖ్యులుగా పాల్గొన్నారు. ఎఫ్‌కెసిసిఐ ద్వారా పారిశ్రామిక ప్రగతి సాధ్యమవుతోందన్నారు. దేశ ఆర్థికతకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చేసిన కృషిని కొనియాడారు. దేశం పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తోందని, ఆ దిశగానే మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎఫ్‌కెసిసిఐ ఛైర్మన్ ఎంజి బాలకృష్ణన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఉమ్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాయిరాం ప్రసాద్, మాజీ ఛైర్మన్ రమేశ్‌చంద్ర లహోటి, మంథన్ సభ ఛైర్మన్ తేజశ్రీ, సలహాదారుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

శిడ్లఘట్ట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె క్రాస్‌లోని జ్ఞానజ్యోతి పాఠశాలలో 41వ వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. విద్యా నిపుణుడు, అంతర్జాతీయ కోచ్ డాక్టర్ పీఎస్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఫీజులు కడితే మన బాధ్యత తీరిపోయిందని భావించకుండా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకోసం తల్లిదండ్రులు కూడా తగిన మార్గదర్శకం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఉమ్మడి కుటుంబాలలో అవ్వా, తాతల ద్వారా సంస్కారం, సమాజసేవ, పెద్దలను గౌరవించే విధానాలు నేర్చుకున్నామన్నారు. ప్రస్తుతం ఉమ్మడికుటుంబాలు తగ్గడమే కాకుండా తల్లిదండ్రులు ఇద్దరు కూడా పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండడంతో చిన్నారుల బాగోగులు పట్టించుకునే సమయం చాలడం లేదన్నారు. ఉన్న కొద్దిపాటి సమయంలోనే పిల్లల చదువు గురించి దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు సభికులను అలరించాయి. వివిధ రంగాలలో రాణించినవారికి బహుమతులు ప్రదానం చేశారు. గ్రామీణ విద్యాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గుడియప్ప, రాష్ట్ర వనరుల వ్యక్తి చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాది శంకరప్ప, జ్ఞానజ్యోతి విద్యాసంస్థ రాజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ మనుశ్రీ, శ్రీనికేతన్ ట్రస్టు పుట్టేగౌడ తదితరులు పాల్గొన్నారు.

శిల్పకళకు ఎంతో ప్రాచుర్యం



విద్యార్థిని అభినందిస్తున్న తహసీల్దారు

బాగేపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో అమరశిల్పి జక్కణ్ణ జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జక్కణాచార్యుల చిత్రపటానికి తహసీల్దారు మనీశామహేశ్ పుష్పాంజలి ఘటించారు. ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయుడు జి.వి.చంద్రశేఖర ప్రధాన ప్రసంగం చేశారు. అమరశిల్పి జక్కణ్ణ చెక్కిన శిల్పాలు బేలూరు, హళేబీడు, సోమనాథపుర తదితర ప్రాంతాలలో ఇప్పటికీ వీక్షించవచ్చునన్నారు. శిల్పకళకు జక్కణ్ణ ఎంతో ప్రాచుర్యం తెచ్చారన్నారు. విదేశీయులు సైతం మన శిల్పకళకు ఆకర్షితులయ్యారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సైతం విశ్వకర్మ పథకం ద్వారా మన సంస్కృతి, వృత్తులను చాటేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇదే సందర్భంగా ప్రతిభావంత విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో బీఈఓ ఎన్ వెంకటేశప్ప, టీపీఓ రంగనాథ్, సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, మంజునాథ్‌చారి, షణ్ముఖ్, వీరాచారి, సుకన్యా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో యోగా తరగతులు ప్రారంభం



ప్రసంగిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

బొమ్మనహళ్ళి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కోరమంగల పోలీస్‌క్వార్టర్స్‌లో ఉన్న ఎంఆర్‌ఆర్‌పి ప్రభుత్వ పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే, రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ మోహన్ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఆధునాతన సదుపాయాలు పాఠశాలను తీర్చిదిద్దారన్నారు. ఇందుకు మాజీ కార్పొరేటర్ మోహన్ ఎంతో కృషి చేశారన్నారు. క్రమం తప్పని యోగాభ్యాసం వల్ల మానసిక ఆరోగ్యం సాధ్యమన్నారు. ఉదయాన్నే కొద్దిసేపు యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ మంజునాథ్, విద్యాశాఖ అధికారులు, స్థానిక పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు గ్యారెంటీలకే సరి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బైరతి బసవరాజ్

మహదేవపుర, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో రాష్ట్రప్రభుత్వం దివాళా తీసిందని అభివృద్ధి కార్యక్రమాలకు తగినంత నిధులు మంజూరు చేయడం లేదని కేఆర్‌పుర ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఆర్‌పుర నియోజకవర్గంలోని బసవనపుర వార్డు విజయ బ్యాంకు కాలనీ, ప్రియదర్శిని లే అవుట్ రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. బీజేపీ ఎమ్మెల్యే కావడంతో నియోజకవర్గానికి తగినంత నిధులు ఇవ్వడం లేద న్నారు. అతికష్టమ్మీద అరకొరగా గ్రాంట్లు ఇస్తున్నారన్నారు. నిధులన్నీ గ్యారెంటీ పథకాలకే కేటాయించడంతో అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ప్రజల సమస్యలకు స్పందించడం కష్టంగా మారిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు తారతమ్యాలు లేకుండా నిధులు మంజూరు చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జయప్రకాశ్, జి.కె.నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు ప్రహరీ ఏర్పాటు



ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది

రాయచూరు జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని చంద్రబండా రోడ్డు నుంచి గద్వాల రోడ్డు వరకు ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు అధికారులు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. 120 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న గుట్టలో భాగంగా 1.20 ఎకరాల భూమిని సఫాయి కర్మచారి కార్మికుల రుద్రభూమి కోసం గతంలో కేటాయించారు. ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసుకుని కబ్జా చేసుకునే ప్రయత్నం చేయగా ఇటీవల జిల్లాధికారి పోలీసుల సహాయంతో ఆక్రమించుకున్న షెడ్లన్నింటినీ తొలగింపచేశారు. ఈక్రమంలో స్థలం మరోసారి కబ్జాకు గురికాకుండా అధికారులు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. పనులను పోలీసుల సహాయంతో బుధవారం కొనసాగించారు.

జెస్కాం జేఈ ఇంటిపై లోకాయుక్త దాడి



జేఈ ఇంటి బయట ఉన్న లోకాయుక్త అధికారులు



జెస్కాం జేఈ హులిరాజ్

రాయచూరు జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యరగేరా సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న జెస్కాం జేఈ హులిరాజ్ ఇంటిపై బుధవారం తెల్లవారుజామున లోకాయుక్త అధికారులు దాడి చేశారు. నగరంలోని మడ్డిపేటతో పాటు ఐడీఎస్ఎంటీ లేఔట్‌లోని ఆయన రెండు నివాసాలపై ఏకకాలంలో దాడులు జరిపిన అధికారులు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల పరిశీలనలో ఏమి జరిగిందన్నదానిపై అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

వీరశైవ లింగాయత మహాసభకు తాలూకాస్థాయి నూతన పదాధికారులు



నూతన పదాధికారులకు సన్మానం

దొమ్మసంద్ర, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా మాస్తేనహళ్ళిలోని వీరశైవలింగాయత మహాసభకు నూతన పదాధికారులు బాధ్యతలు చేపట్టారు. గుమ్మళాపుర సంస్థాన మఠం శివానంద శివాచార్య స్వామిజీ మాట్లాడుతూ లింగాయత సామాజికవర్గంలో ఐకమత్యం మరింత పెరగాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన పిల్లల విద్యాభ్యాసానికి సంఘం చేయూత ఇవ్వాలని సూచించారు. తద్వారా సమాజంలో విద్యాశాతం ప్రగతిసాధ్యమన్నారు. విద్యతోనే సమాజంలో పురోగతి వీలవుతుందని అందుకు ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. సంఘం తాలూకా అధ్యక్షులు హిన్నక్కి జయణ్ణ మాట్లాడుతూ ఆనేకల్ పట్టణంలో సామాజిక అభివృద్ధికోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. ఆనేకల్ పట్టణంలో బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు సంఘం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. బీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కేఎస్ నటరాజ్, శరణసాహిత్య పరిషత్ అధ్యక్షుడు శివణ్ణ, ప్రముఖులు చిక్క రేవణ్ణ, దొమ్మసంద్ర జయణ్ణ, హెన్నాగర మహేశ్ తదితరులు పాల్గొన్నారు. సంఘం తాలూకా నూతన పదాధికారులలో అధ్యక్షులుగా హిన్నక్కి జయణ్ణ, కార్యాధ్యక్షులుగా అరుణ్, ఉపాధ్యక్షులుగా మంజుళ నీల కంఠయ్య, చంద్రశేఖర్, విరూపాక్షప్ప, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్, కోశాధికారిగా మహేశ్, సంఘటనా కార్యదర్శిగా పరమశివయ్య, ఉమేశ్, సభ్యులుగా విజయచంద్ర, రాజణ్ణ, చంద్రప్ప, చంద్రశేఖర్, భారతి విరూపాక్షయ్య, మలికమ్మకీర్తి, శివకుమార్, విజయ్, గణేశ్, మంజునాథ్ ఎంపికయ్యారు. ఆనేకల్ పట్టణ, సర్జాపుర, అత్తిబెలె, జిగణి హోబళిలకు అధ్యక్షులు, మహిళా విభాగానికి పదాధికారులు ఎంపిక చేశారు.

వృద్ధురాలికి న్యాయం చేయాలని డిమాండ్



వృద్ధురాలితో స్థానిక సంఘాల ప్రముఖులు

బంగారపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నేటికీ దళితులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని దళితుల ఇళ్లకు కేటాయించిన రోడ్డును సైతం కొందరు ఆక్రమించి షెడ్ నిర్మించారని వెంటనే చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సేవా సమితి సంస్థాపనా అధ్యక్షుడు సందేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అబ్దుల్ అలి లే అవుట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత సామాజికవర్గానికి చెందిన 75ఏళ్ల వృద్ధురాలు మంగమ్మ ఆకుకూరలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోందన్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ నుంచి రుణం పొంది సర్వే 23/2లో ఇంటి స్థలం కొనుగోలు చేసి పురసభ నుంచి ఖాతా నమోదు చేసి ఇల్లుకట్టుకున్నారన్నారు. సదరు ఇంటికి ఎన్నోఏళ్లుగా రోడ్డు ఉందన్నారు. ఇంటి ముందుభాగంలో ప్రభావితులైన భరత్, అశోక్, మంజు, దీపక్‌లు రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మించారన్నారు. దీంతో రోడ్డు మూసివేయడంతో వృద్ధురాలికి అన్యాయం జరిగిందన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని వృద్ధురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుపేంద్ర, రవికుమార్ తదితరులు ఉన్నారు.

జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి



గోరేబాళ గ్రామంలో పర్యటిస్తున్న జడ్పీ ఉపకార్యదర్శి శశికాంత్ శివపురె

రాయచూరు జనవరి 8(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాకు సంబంధించి జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని జడ్పీ ఉపకార్యదర్శి శశికాంత్ శివపురె ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో బస పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి జిల్లాలోని సింధనూరు తాలూకా గోరేబాళ గ్రామ పంచాయతీ క్యాంపులో నిద్రించిన జడ్పీ ఉపకార్యదర్శి బుధవారం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారి త్వరితగతిన వాటిని పూర్తి చేయాలన్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల గురించి గ్రామీణ ప్రజలతో చర్చించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మురికివాడల అభివృద్ధికి ప్రణాళిక



స్లం బోర్డు కమిషనర్‌కు వినతి పత్రం కమిటీ సభ్యులు

రాయచూరు జనవరి 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మురికివాడల అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మండలి ఏర్పడి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా బుధవారం బెంగళూరులో నిర్వహించిన స్లం బోర్డు సమావేశానికి జిల్లా నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు. రాయచూరు నగర స్లం క్రియావేదిక కమిటీ సభ్యులు పాల్గొని స్థానిక మురికివాడాల్లో చేపట్టాల్సిన అభివృద్ధికి ఎదురవుతున్న సమస్యలు తదితర వాటి గురించి బోర్డు దృష్టికి తెచ్చారు. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశానికి పూర్వమే మురికివాడల అభివృద్ధికి సంబంధించి స్లం బోర్డు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు స్లం వేదిక చేపట్టాల్సిన కార్యక్రమాలు మురికివాడల నిర్మూలన కోసం భవిష్యత్తు ప్రణాళికపై చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం బెళగావిలో జరుగుతున్న శీతాకాల శాసనసభ సమావేశాల్లో మురికివాడల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల గురించి స్లం బోర్డులో చర్చించారని జిల్లాకు చెందిన పలువురు నాయకులు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	162.72	1,583.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,270	0
నీటి నిల్వ (టీఎంసీలు)	75.58	10.22

రేపు అల్లీపుర మహాదేవ తాత రథోత్సవం


మహాదేవ తాత

బళ్లారి సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలో వెలసిన అల్లీపుర మహాదేవతాత రథోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మఠం కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు గరగ శివయగి మడివాళేశ్వర పురాణం, మహా మంగళహారతి నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రసాద సేవ ఉంటుందన్నారు. బుధవారం అల్లీపురం, కార్చేడు, శ్రీధరగడ్డ, కొలంగల్లు, సంగనకల్లు తదితర గ్రామాలకు చెందిన భజన బృందాలతో రాతి భజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రథోత్సవరం రోజు గంగపూజ అనంతరం మడుగు తేరు లాగుతారన్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం


హెడ్ కానిస్టేబుల్ దినకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్/సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న రంగ మందిరం ఆవరణలో రెండు రోజుల పాటు జరిగిన జి ల్లా కళా వైభవ కార్యక్రమంలో పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన దినకర్‌ను కళాకారుల సంఘం అధ్యక్షులు మల్లన్నగౌడ శంకర బండ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందిస్తూ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ తనవంతుగా సహాయం అందిస్తున్న నేపథ్యంలో హెడ్ కానిస్టేబుల్ దినకర్‌ను సత్కరించారు. ఉపాధ్యక్షులు వీణాకుమారి, రమణప్ప, భజంత్రీ సిద్దయ్య స్వామి, తిప్పేస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

దేవదాసీ మహిళల జనాభా గణన చేపట్టాలి


సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న పదాధికారులు

బళ్లారి సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి వెళ్లి దేవదాసీ మహిళల గణన చేపట్టాలని రాష్ట్ర దేవదాసీ మహిళా విముక్తి సంఘం సండూర్ తాలూకా యూనిట్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. జిల్లా కమిషనర్ల ద్వారా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించి అనంతరం ఆ సంఘం కార్యదర్శి స్వామి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్లు, రాష్ట్రకమిటీ ద్వారా దేవదాసీ మహిళల గణన చేపట్టాలని కోరారు. గతంలో ఇలాంటి గణనలో పాల్గొన్న అంగన్‌వాడీ ఉద్యోగులపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. దేవదాసీ స్త్రీలు కానివారిని చేర్చారన్నారు. కార్యక్రమంలో దేవదాసీ మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న దంత వైద్యులు

బళ్లారిరూరల్/సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్‌లో ఉన్న శ్రీ నందా వసతి కళాశాల చైర్మన్ వి.గాంధీ నేతృత్వంలో పాఠశాల, కాలేజ్ విద్యార్థులకు బుధ, గురువారాల్లో 957 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దీవ ప్రకాష్ విద్యార్థులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత వినాయక పవర్ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

● డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా


మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారిసిటీ జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్యవివాహాలు నిర్మూలనపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ హాల్లో బాలల పరిరక్షణ విభాగం, స్త్రీ శిశు అభివృద్ధి శాఖ వివిధ పథకాల అమలు,జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం, ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో బాల్యవివాహాల కేసులు వెలుగు చూసినప్పుడు ఆ శాఖ అధికారులు, పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. బాలల హెల్ప్‌లైన్, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం, బాలకార్మిక నిషేధ చట్టం తదితర అంశాలపై పోలీసు,స్త్రీశిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ సహకారంతో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. దోపిడీకి గురవుతున్న మహిళల సమస్యలను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలని, ఈ చట్టంపై గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శులు సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె, సీఈఓ రాహుల్ శరణప్ప, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, బాలల సంరక్షణ విభాగం చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి నాగప్ప, వివిధ శాఖల అధికారులు, ఎన్‌జీఓ సంస్థలు పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి


హుబ్బళ్లి డివిజన్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైల్వే యాక్షన్ క్లబ్ కమిటీ

బళ్లారి సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ నైరుతీ రైల్వే హుబ్బళ్లి డివిజన్ మేనేజర్ బిలా మీనాకు రైల్వే యాక్షన్ క్లబ్ కమిటీ వినతి పత్రం సమర్పించింది. నగరంలోని సెంట్రల్ రైల్వే స్టేషన్‌ను కమిటీ నాయకులు సందర్శించారు. బెళగావి-మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు గత కొన్ని రోజులుగా నిలిచిపోయిందన్నారు. షిమోగా-బళ్లారి-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు, కదిరిదేవరపల్లి-బళ్లారి-తిరుపతి రైలును తిరిగి ప్రారంభించాలన్నారు. హొస్పేట్-బళ్లారి మార్గంలో ఉదయం బెంగళూరుకు చేరుకుని రాత్రికి చేరుకునే రైలును తిరిగి నడపాలన్నారు. ముంబై-హొసపేట ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును బళ్లారి వరకు పొడిగించాలన్నారు. హొసపేట నుంచి బళ్లారికి వచ్చివెళ్లడానికి సమయం తక్కువగా ఉంటే, ఈరైలు సర్వీసును బెంగళూరు లేదా మైసూర్ వరకు పొడగించాలన్నారు. చిక్కజాజూరులో విజాపూర్ మంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు లింక్ సౌకర్యం కల్పించాలని, గదగ్ నుంచి హొస్పేట బళ్లారి చిత్రదుర్గ మీదుగా చిక్కజాజూర్ లింక్ మంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించాలన్నారు. డిమాండ్లను నెరవేర్చుందుకు నెల రోజులు గడువు ఇస్తామని, స్పందించకపోతే ఈవిభాగంలో తిరిగే గూడ్స్ రైళ్లను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఫిబ్రవరి 2వ వారంలో పోరాటం చేపట్టనున్నట్లు కమిటీ నాయకులు తెలిపారు.

దరోజీ సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం


అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించిన సంఘం సభ్యులు

కంప్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని కొత్త దరోజీ ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 12 మంది సభ్యులు వుండగా అందులో అధ్యక్ష స్థానానికి మంజునాథ్, ఉపాధ్యక్ష స్థానానికి వలీ మసీద్ నామినేషన్ వేశారు. వారికి ఎవరూ పోటీ లేకపోవడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి గంగాధర తెలిపారు. గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు సభ్యులను కూడా అభినందించారు. అధికారి గంగాధర వారికి అర్హత పత్రం అందించారు. కార్యదర్శి యర్రిస్వామి, మాజీ జిల్లా పంచాయతీ సభ్యులు జనార్ధన, తాలుకా పంచాయతీ మాజీ అధ్యక్షులు మారెప్ప పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి


అమృతవాహిని వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ

తోరణగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్ కోరారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ కళ్యాణ శాఖ ఆధ్వర్యంలో ఎన్‌ఎండీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ఏడాదికి రూ.కోటి ఖర్చుతో తాలుకా గ్రామ పంచాయతీ గ్రామాలకు డాక్టర్ల ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందించడానికి అమృతవాహిని సంచార ఆరోగ్య సేవలు అందించే వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సత్వర వైద్యం అందించేందుకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతివారం కేటాయించిన గ్రామాలకు వాహనాలు వస్తాయని అలాగే అమృతవాహిని వాహనాల్లో వైద్యాధికారులు, ఔషధాలు, మహిళా ఆరోగ్య సహాయకులు మొత్తం ఆరుగురు ఉంటారన్నారు. గర్భిణులకు అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సండూరు పురసభ అధ్యక్షులు సిరాజ్ హుస్సేన్, ఉపాధ్యక్షురాలు లతా ఉజ్జప్ప, ఎన్‌ఎండీసీ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ సింగ్ సీఎస్ఆర్ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ చటర్జీ, డీజీఎం వేలు, వసంత జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ రమేష్ బాబు తాలుకా వైద్యాధికారి భరత్‌రెడ్డి జిల్లా ఆరోగ్య శిక్షణ అధికారి దానప్ప డాక్టర్ సునీత, డాక్టర్ హరీష్, పురసభ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు లీక్.. నాలుగు దుకాణాలు దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న నగర పాలికె అధికారులు

గంగావతి రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గంగావతి పట్టణంలోని చినువాలా ఆసుపత్రి ఎదురుగా ఉన్న నాలుగు దుకాణాలు గ్యాస్ సిలిండర్లు లీకై దగ్ధమయ్యాయి. టీ దుకాణంలో సిలిండర్లు లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ఉన్న మరో మూడు దుకాణాలకు వ్యాపించి కాలి బూడిదయ్యాయి. ఆ ప్రాంతంలో కొన్నిగంటలపాటు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘటన జరిగిన టీ దుకాణానికి ఆనుకుని ప్రైవేట్ ఆసుపత్రి ఉండడంతో అగ్నికీలలతో ప్రధాన ద్వారం దెబ్బతింది. ఈ ఘటనలో టీకొట్టు యజమాని, ఆసుపత్రి డాక్టర్ చనివాల గాయపడ్డారు. మంటలు ఆర్పడానికి చుట్టుపక్కల వారు పైపులతో నీరు చల్లినా అదుపులోకి రాలేదు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఘటన మంగళవారం మధ్యరాత్రి జరగడంతో ఆలస్యంగా తెలుసుకున్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో మేదార అనే వ్యక్తికి చెందిన పెంపుడు కుక్క గట్టిగా అరవడంతో పాటు ఇంటిలోని సామాన్లను చెల్లాచెదరు చేయడంలో ఉలిక్కి పడి లేచిన మేదార అనే వ్యక్తి ఇంటి చుట్టుపక్కల ప్రజలను అప్రమత్తం చేయడంలో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. ఘటనా స్థలానికి నగరసభ అధ్యక్షుడు మౌలాసాబు, రెవెన్యూ అధికారులు చేరకుని పరిస్థితిని సమీక్షించి నష్టపరిహారంపై అంచనా వేశారు. ఘటనలో గాయపడిన డాక్టర్ చెనవాల, టీకొట్టు యజమాని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


ప్రమాదంలో కాలిబూడిదైన దుకాణాలు


కరపత్రాలను విడుదల చేస్తున్న యువనిధి శాఖ సిబ్బంది

'యువజన నిధి'ని వినియోగించుకోండి

బళ్లారి సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హామీ పథకాల్లో యుజన నిధిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ పథకం జిల్లా ఉపాధ్యక్షుడు సంగనకల్లు విజయకుమార్ పిలుపునిచ్చారు. 2023-24 గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఉత్తీర్ణులైన విద్యార్థులు కనీసం ఆరు నెలల పాటు ప్రభుత్వ, ప్రైవేట్, స్వయం ఉపాధి పొందని, ఉన్నత చదువులు చదవని విద్యార్థులు అర్హులని బళ్లారి స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్, జీవనోపాధి విభాగం అధికారి హట్టప్ప తెలిపారు. విద్యార్హత, కనీసం ఆరు సంవత్సరాలు (గ్రాడ్యుయేషన్ డిప్లొమా చదివిన వారు) పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. యువనిధి కోసం ప్రతినెలా 1 నుంచి 25వ తేదీ మధ్య నెలవారీ స్వయం నిరుద్యోగ ప్రకటనను సమర్పించడం తప్పనిసరి అన్నారు. వారి పదోతరగతి, పీయూసీ, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా సర్టిఫికేట్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డుతో నమోదు చేసుకోవాలన్నారు. ఇందు కోసం నెలకు రూ.3000, గ్రాడ్యుయేషన్ ఫీజు, డిప్లొమా ఉత్తీర్ణులకు నెలకు రూ.1500 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పరశురాం పాల్గొన్నారు.

రైతులతో అధికారుల చర్చలు


నిరసనలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్

కంప్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో కర్మాగారాలకు పొలాలు పోగొట్టుకున్న జానెకుంటి, అరిగిణదోణి, యర్రంగళి, కొళగల్, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం గ్రామాల రైతులు నిరసన చేపట్టి 752 రోజులు కావడంతో బుధవారం అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ కుడితిని చేరుకుని రైతులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ 9వ తేదీన జిల్లా అధికారి నేతృత్వంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో చర్చలు చేపట్టిన అనంతరం ఒక నిర్ణయం తీసుకుంటామని, అంతవరకు ఎలాంటి చర్యలకు పాల్పడరాదని సూచించారు. వారితో పాటు తహసీల్దార్ గురురాజు, డీవైఎస్పీ ప్రసాద్ గోఖలే, సీఐ విశ్వనాథ్, హిరేగౌడ, శ్రీధర్, ఉచ్చప్ప, మల్లికార్జున, మంజునాథ్, నాగప్ప, శివన్న, గంగమ్మ, నాగమ్మ, కుడితిని, హరిగిణదోణి, జానెకుంటి, వేణి వీరాపురం, రైతులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన


దోమకాటుతో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సిరుగుప్ప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దోమ కాటుకు గురైన వరి పంటలను కొప్పాళ జిల్లా వ్యవసాయ పరిశోధన నిపుణుడు డాక్టర్ విజయ్ పంటలను పరిశీలించారు. బుధవారం తాలుకాలోని ఉప్పర హోసళ్లి, బలకుంది గ్రామాలలో పర్యటించారు. దోమ కాటుకు గురైన వరినారును ఆయన పరిశీలించారు. దోమకాటు నివారణపై రైతులతో చర్చించి ఏఏ మందులు పిచికారి చేయాలో అవగాహన కల్పించారు. సిరుగుప్ప తాలుకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీ పాటిల్, దడేసూగూరు వ్యవసాయ నిపుణులు శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

జయంతి వేడుకల నిర్వహణపై సమావేశం

సిరుగుప్ప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జనవరి 14న సిద్దరామేశ్వర జయంతి, 19న యోగి వేమన జయంతి, 21వ తేదీ అంబిగర చౌడయ్య జయంతి వేడుకల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హైస్కూలు గ్రౌండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఊరేగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కంప్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదల, దీక్షతో చదువుకోవాలని తాలుకా శిక్షణ అధికారి సిద్దలింగమూర్తి సూచించారు. మంగళవారం దేవలాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించగా ఆయన కూడా వారితో భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ప్రభుత్వాలు ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నాయన్నారు. ఆయనతో పాటు సీఆర్పీ వీరేష్, ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ వున్నారు.

వసతిగృహాల ప్రారంభం

తోరణగల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అరణ్యశాఖ దక్షిణ వలయ నూతన వసతి గృహాలను ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారామ్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మన చుట్టూ మంచి అరణ్యాలను పెంచాలని అది అందరి బాధ్యత అన్నారు. మన ఇంటి చుట్టుపక్కల మొక్కల్ని నాటాలన్నారు. విద్యార్థిని విద్యార్థులకు అరణ్యాలను అరణ్య ప్రాణులపై అవగాహన కల్పించాలని శిక్షణాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

రైతు నుంచి రూ.6 లక్షల అపహరణ


మెకానిక్ షెడ్డు వద్ద సీసీ ఫుటేజీలో పుల్లంరాజు వెనుక భాగంలో నిల్చున్న దొంగ

కంప్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం పట్టపగలే రూ.ఆరు లక్షలు దొంగతనం జరిగింది. తాలుకాలోని బసవేశ్వర క్యాంపుకు చెందిన పుల్లం రాజు అనే రైతు పొలం పనుల కోసం ఎస్‌బీఐ బ్యాంకులో డబ్బు తీసుకుని కారు రిపేరీ కోసం బళ్లారి రోడ్డులోని రాజా మెకానిక్ షెడ్డు వద్దకు వెళ్లాడు. అంతకుముందే బ్యాంకులో పుల్లం రాజు డబ్బులు డ్రా చేసిన విషయం గమనించిన దొంగలు అక్కడి నుంచి ఆయనను కారు మెకానిక్ షెడ్ వరకు ద్విచక్ర వాహనంలో వెంబడించారు. అక్కడ పుల్లం రాజు కారు షెడ్డు వద్ద మెకానిక్ కారు రిపేరీ చేస్తుండగా ఆయన డబ్బులు వుంచిన బ్యాగును పక్కనే వుంచుకున్నాడు. ఆయన కారు రిపేరీపై దృష్టి వుంచిన సమయంలో దొంగలు చాకచక్యంగా బ్యాగును తీసుకుని రెండు నిమిషాల్లో అక్కడి నుంచి పరారయ్యారు. గమనించిన పుల్లంరాజు డబ్బులు కనిపించకపోవడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఆయన కంప్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు మెకానిక్ షెడ్డు వద్ద సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. డబ్బులు బ్యాగును దొంగలు ఎత్తుకెళ్లే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

హోసూరు జోన్

కళాశాలలో కవితా పోటీలు

హోసూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ సాహిత్య పోటీలను హోసూరులోని ఓ ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో జరిగాయి. కృష్ణగిరి జిల్లా పరిధిల్లోని అన్ని కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు ఇస్రో ప్రోగ్రాం డైరెక్టర్ సైంటిస్ట్ అందజేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ డాక్టర్ వనంగమూడి ప్రధాన ప్రసంగం చేశారు. తిలకవతి, డాక్టర్ లక్ష్మి, జిల్లా కార్యదర్శి మాణిక్యవాసగం జిల్లా కోశాధికారి ఎళిలరసన్, నగర కార్యదర్శి వడివేలు, మున్సిపల్ డిప్యూటీ సెక్రటరీ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు సంపత్ కుమార్ వ్యవహరించారు. కవితల పోటీ ప్రథమ బహుమతిని కృష్ణగిరి ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన రోహిణి, ద్వితీయ బహుమతి బేలుపల్లి అరింజర్ అన్నాఆర్ట్స్ కళాశాలకు చెందిన చంద్రమతి, తృతీయ బహుమతిని హోసూరులోని పెరుమాళ్ మణిమేగలై కళాశాలకు చెందిన భువనేశ్వరీ దక్కించుకున్నారు. ప్రసంగ పోటీలలో కృష్ణగిరి ప్రభుత్వ మహిళా ఆర్ట్స్ కళాశాల, ద్వితీయ బహుమతి బేలపల్లిలోని ఆధవన్ అరింజర్ అన్నా ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల, తృతీయ బహుమతి వేల్ మురుగన్ సెయింట్ జోసెప్ కళాశాలకు లభించాయి. పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


వేదికపై ప్రముఖులు

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నేత్ర పరీక్షలు

హోసూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓ ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని జూజువాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిబిరం జరిగింది. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థినులకు ఉమెన్స్ ఆర్గనైజేషన్, హోసూరు నగరంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థ, ప్రైవేట్ ఐ లెన్స్ తయారీ సంస్థ సహకారంతో ఉచిత కంటి పరీక్షల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. 200 మందికి పైగా విద్యార్థులకు పరీక్షలు చేయగా 20 మందికి కంటి లోపాలున్నట్లు గుర్తించారు. వారికి ప్రత్యేకంగా కాంటాక్ట్ లెన్సులు ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

సైన్స్‌కిట్ వినియోగంపై అవగాహన


పాఠశాలకు సైన్స్‌కిట్ అందజేస్తున్న దృశ్యం

హోసూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హోసూరు ఆర్‌వి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ కిట్ల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హోసూరు శూలగిరి, వేపన్నపల్లి యూనియన్‌లకు చెందిన 80కిపైగా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సైన్స్ ల్యాబ్ పరికరాలను అందజేసి విద్యార్థులకు ఎలా ఉపయోగించాలనే అంశంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. కృష్ణగిరి జిల్లా ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ అధికారి మునిరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. హోసూరు విద్యాశాఖ జిల్లా విద్యాశాఖాధికారిణి రమాపతి, సబ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ బాబు హాజరై ప్రత్యేక ప్రసంగం చేశారు. భారతీయ అక్షరాస్యత ప్రాజెక్టు కమిటీ వద్ద కార్యక్రమాలు కొనసాగాయి.

పౌరకార్మికులకు ఆత్మీయ సత్కారం


పౌరకార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

హోసూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన చైర్మెన్, వార్డు కౌన్సిల్ యూనియన్ కౌన్సిలర్ తదితరులు పదవీకాలం జనవరి 5 తో ముగిసింది. ఈ నేపథ్యంలో హోసూరు యూనియన్ నల్లూరు ప్రాథమిక పంచాయతీ చైర్మెన్ శాంతవీరభద్రప్ప ఆయన హయాంలో చక్కగా పనిచేసిన పౌరకార్మికులకు శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రజలకు సేవ చేసిన కౌన్సిల్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు మునియమ్మ, మునియలప్ప, శశికళ వెంకటేశ్, జయలక్ష్మి, జయరామప్ప, కవితా శ్రీనివాస్, మంజుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్, హోసూరు యూనియన్ డీఎంకే ఉప కార్యదర్శి వీరభద్రప్పతో పాటు పలువురు పాల్గొన్నారు.